
కథ

# అంధ తమస్సు

అక్షర వాచస్పతి
డాక్టర్ దాశరథి రంగాచార్య



**ఆది చెట్టు. ట్రీ. ఒంటరిగా - ఏకాకిగా నిలిచి ఉంది. దాని పుత్ర, బంధు, మిత్రాదులను, వనమహోత్సవం మింగేసింది. ఇది చెట్లను కూల్చే నాగరకత. చెట్లను కాల్చే నాగరకత!**

ఆ చెట్టు వంటరిగా నిలిచింది. మునిలా నిలిచింది. ఎడారిలో ఒయాసిస్సులా నిలిచింది. అవును ఒక్క చెట్టు ఎందుకు మిగిలింది? వన మహోత్సవానికి ఆహుతి ఎందుకు కాలేదు?

ఆశ్చర్యమే! చెట్టు మనిషిని బ్రతికిస్తుంది. తాను బతుకుంది. ఈ అనాగరకత తాను బతకదు. ఎదుటివాణ్ణి బ్రతకనీయదు! బతుకును ఇస్తుందని చెట్టు మీద కసి! చెట్టు ఉంటే ఆక్సీజనుకు మార్కెటు ఉండదు! ఇది మార్కెటు నాగరకత! ఇది శవాలను సహితం మార్కెటు సృష్టించగలదు! ఒకటి కొంటె - రెండు ఉచితం.

ఆశ్చర్యమే--అయినా ఆ చెట్టు నిలిచింది! అది రావి చెట్టు- -అశ్వత్థం! అశ్వత్థః సర్వవృక్షాణాం. చెట్లన్నింటిలోనూ నేను రావిని అన్నాడు గీతలో పరమాత్మ. రావిచెట్టు నీడనే గౌతముడు బుద్ధుడు అయినాడు. ఇవేమీ తెలియవు చెట్లు నరికే కూలీకి! అయినా అతనికి అది దేవుడు అని తెలుసు నన్నాడు. దండం పెట్టాడు సాగిపోయాడు.

అలా బతికింది అశ్వత్థం ప్రాహురవ్యయం - అవినాశ్యమైన రావిచెట్టు! భారత తాత్వికత రావిని రక్షించుకుంది.

భారత తాత్వికత వ్రాతలో మాత్రమే కాదు రక్తంలో ఉంటుంది. సంప్రదాయంలో ఉంటుంది. ఆచారంలో ఉంటుంది!

ఈ దేశపు అతి సామాన్యునికి అక్షరం రాకపోవచ్చు. అతని సంస్కారం సముద్రమంత! అక్షరం వర్తకం!! సంస్కారం జీవితం! సంస్కారం అక్షరం!

అట్టి రావిచెట్టు కింద ఒక స్త్రీ - మహిళ - యువతి ఉంటుంది. ఆమె ఆహుతి. ఆమెకు బాబు మధు, పాప దధి. ఆ చెట్టు ఆమె నివాసం. చాప - మూడురాళ్ల పొయ్యి - రెండు కుండలు - రెండు మూకుళ్లు ఆమె ఆస్తి!

వాస్తవానికి జీవితం అంత సింపుల్! పిట్ట చెట్టు మీద ఉంటుంది. అవసరం అవుతే తప్ప గూడు కట్టుకొనదు! అది జత కడ్తుంది. గుడ్లు పెడ్తుంది. పిల్లలను చేస్తుంది. వాటికి రెక్కలు తెప్పిస్తుంది. అవి ఎగిరిపోతాయి! దానికి దిగులు లేదు. ఆకాశంలో విహరిస్తుంది. రాలిపోతుంది!

అంత సింపుల్ జీవితాన్ని మార్కెట్ కాంప్లికేట్ చేస్తుంది. మనిషిని బానిసను చేస్తుంది. సుఖపడనీయదు? బతకనీయదు. చావనీయదు. బతుకు లాగాలి!

ఆహుతి చెట్టు కింద కూర్చుంటుంది. దధి మధు ఆమెకు రెండువక్కల, ఆమె బ్యాగు అల్లుతుంది. ఎవడో కొనకపోడు. అది ఆమె జీవిక. అదే ఆమె లోకం! ఆమెకు మరో లోకం తెలియదు!

ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటాయి. చలిగాలి రివ్వున వీస్తుంది. దధి, మధు, తల్లిని కరచివట్టుకుంటారు. ఆహుతి వారిని బిగి పట్టుకుంటుంది. పిల్లలు తల్లి గుండెల్లో, అది అనిర్వచనీయ ఆనందం!

చిటపట చినుకులు, ధారగా వాన. కమ్మని పరిమళం! ఆహుతి దధి, మధులు చాపచుట్టుకుంటారు. చెట్టు మొదట నిలుచుంటారు.


మెరస్తుంటుంది.

ఉరుముతుంటుంది.

కురుస్తుంటుంది.

వరదలు పారుతుంటాయి. ఆహుతి ఇద్దరి తలల మీద చేతులు. పలకరు చూస్తుంటారు. అది రమ్యదృశ్యం! అది అందరికీ అందదు.

వాన ఎప్పటికీ ఉండదు. ఏదీ ఎప్పటికీ ఉండదు. అది జీవిత సత్యం. ఆ సత్యం ఆహుతికి తెలుసు. అందుకే ఆమెకు ధైర్యం.



ధైర్యం జీవితం!


భయం మృత్యువు!!

వాన వెలుస్తుంది. వెన్నెల విరుస్తుంది. వాననీటి కాలువలు మూగగా పార్తాయి!

ఆహుతి జీవితం సామాన్యం అవుతుంది. చాప పరచుకుంటుంది. నిద్ర జోకొడుతుంది.

రావి రోడ్డుకు మరీ దగ్గరగా లేదు. అయినా రోడ్డు నుంచి చూస్తే కనిపిస్తుంది. రోడ్డు మీద కార్లు మరీ ఎక్కువ తిరగవు. శివలింగం కారు రోజూ తిరుగుతుంది. అతని ఇండస్ట్రీ రావికి ఆవల, ఇల్లు రావికి ఈవల. కాబట్టి కారు తిరుగుతుంది.

ఒకనాడు శివలింగం ముందు రావిని తరువాత ఆహుతిని చూచాడు. చాచుకుపోయాడు. రెండో రోజూ అంతే! మూడోనాడు ఆసక్తి కలిగింది. కారు



ముత్తాత దాశరథి రంగాచార్య 75 శరత్తులు - మునిమనుమడు సంహిత్ 4 నెలల పసిప్రాయం

ఫోటో: పున్నాస్వజన్

నిలిచింది. డ్రైవరు ఆహుతి వద్దకు వచ్చాడు. ఆహుతి తన కథ చెప్పింది. అది సంగ్రహంగా ఇలా ఉంటుంది.

000

ఆహుతి భర్త శరత్ ఇంజనీరు. అతడు ఒక ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. వారిది అన్యోన్య దాంపత్యం. ఇద్దరు పిల్లలు. వారి సంసారంలో వసంతం వికసించింది. అమాంతంగా శిశిరం వాలింది. ఆకు రాలింది.

డ్యూటీకి పోయిన శరత్ తిరిగి రాలేదు. ఆహుతి ఊరూవాడా వెదికింది. ఫ్యాక్టరీలో విచారించింది. సమాచారం లేదు. ఒకడు రహస్యంగా చెప్పాడు. శరత్ కారు ప్రమాదంలో చనిపోయాడు. ఎవరికీ తెలియనీయలేదు. దహనం చేశారు. ఆహుతికి అర్థం అయ్యేవరకే ఆమెను ఇంట్లోంచి బయటకి గెంటారు. శాసనానికి వేల రంధ్రాలు! ఆమె రావి కిందికి చేరింది.

డ్రైవరు శివలింగానికి ఆహుతి కథ వినిపించాడు. కారు కదిలింది. శివలింగానికి ఏసీలోనూ చెమటపట్టింది. సరిగ్గా అడిగావా? సరిగ్గా విన్నావా? అని డ్రైవరును అడుగుదా మనుకున్నాడు. అడగలేకపోయాడు. మనసు మనసులో లేనట్లున్నది. బేచైన్గున్నాడు.

శాసనాన్ని వంచించడం సులభం!

అంతరాత్మను వంచించడం అంత సులభం కాదు!

కొన్నాళ్లు శివలింగం లేడు. వ్యాపారం మీద విదేశాలకు వెళ్లాడు? అతని పరిశ్రమల షేర్ల విలువ పడిపోతున్నది. శివలింగం విదేశాల నుంచి తిరిగి వచ్చాడు. అతని అంతరాత్మ వేధిస్తున్నది! అదే తన పతనానికి కారణం అనుకుంటున్నాడు. ఇతరులకు చెప్పుకోలేడు!

శివలింగం కారు రావిచెట్టు ముందరి రోడ్డు మీద నిలిచింది. డ్రైవరు మిఠాయి బుట్టలతో ఆహుతిని చేరాడు. ఆహుతి బుట్ట అల్లుతున్నది. పిల్లలు మట్లో ఆడుకుంటున్నారు. పరిగెత్తివచ్చారు. అపుడు ఆహుతి తలెత్తి చూచింది. స్వీట్సుతో డ్రైవరు నుంచున్నాడు.

ఆహుతి డ్రైవరును చూచింది. చూపు ప్రసన్నంగా లేదు. భగ్గుమనడమూ లేదు. వాడిగా ఉంది. సూటిగా ఉంది. డ్రైవరు తడబడ్డాడు. చేతులు వణికాయి.

సేటు ఇచ్చి రమ్మన్నడు

మాకు దేవుడు శక్తి నిచ్చాడు. కష్టపడి బతుకుతాం. దానధర్మాలు మాకు వద్దు.

దధి మధు తల్లిని చూస్తున్నారు.

డ్రైవరు తల వంచుకుని నుంచున్నాడు. మాట మాట్లాడలేకపోయాడు. తిరిగి వెళ్లిపోయాడు. శివలింగం విన్నాడు. నిశ్చేష్టుడు అయినాడు. తాను ఎంతమందికో ఎన్నో ఇచ్చాడు. ఎన్నో సాధించాడు. ఇది తన జీవితంలో తొలితిరస్కారం! తన అంతరాత్మను బుజ్జగించడానికి తాను ఇవ్వజూపిన మూల్యం! ఆమె ఒక సాధారణ స్త్రీ తిప్పి కొట్టింది!

సాధారణంగా ఈ పరిస్థితుల్లో ధనం మండి పడుతుంది! ఆహుతిని ఆర్పేస్తుంది. కాని శివలింగం మండిపడలేదు. అతడు మరోపాపం చేయదలచలేదు!

ఆహుతి ఆత్మగౌరవం - శ్రమ మీద ఆమె విశ్వాసం! అవి అతనిలో కొంత ఆరాధనా భావంలాంటిది కలిగించాయి. డ్రైవరు చేతిలో మిఠాయి బుట్ట అందుకున్నాడు. రావి వైపు సాగాడు. ఆహుతి ఎదురు వచ్చింది.

"సేటూ! నమస్కారం. మేము కష్టం చేసుకోగలం. అవిటివాళ్లకు, రోగులకు, పిల్లలకు పంచిపెట్టండి."

శివలింగానికి ఆమె శాసిస్తున్నట్లు అనిపించింది. స్వార్థం లేనపుడు మనిషికి ఎంత శక్తి వస్తుందో అర్థం అయింది.

నిస్వార్థం స్వార్థాన్ని ఓడించగలదు!

శివలింగానికి మాట రాలేదు. "అమ్మా అలాగే చేస్తాను. వికలాంగులకే స్వీట్లు ఇస్తాను. నమస్కరిస్తున్నాను" అని కారును ఊరివైపు తిప్పాడు.

ఆహుతి పొయ్యి వెలిగించింది. అన్నం వండింది. పిల్లలకు చిప్పల్లో పెట్టింది.

"అమ్మా! వాళ్లు తెచ్చినవి ఇంతకంటే బావుంటాయా?" దధి అడిగింది.

"ఉండవమ్మా! ఇది మన శ్రమ. అమృతం! అది శ్రమ దోపిడి - కేవలం విషం!!"

రుచి మనసుకు సంబంధించింది.

శివలింగం ఆహుతి చెప్పినట్లే చేశాడు. వికలాంగులకు పండ్లూ, స్వీట్లూ పంచిపెట్టాడు. తెల్లవారి అతని కంపెనీల షేర్ల విలువ స్థిర పడింది. పతనం నిలిచిపోయింది. మునగనున్న వానికి పూచికపుల్ల దొరికింది! శివలింగం పొంగి పోయాడు 'ఆ యమ్మదయ' అనుకున్నాడు. చెంపలు వేసుకున్నాడు. హుండీలో డబ్బు వేశాడు. శివలింగం దంపతులు బట్టలు, ఫలములు, స్వీట్సు తీసుకొని సపరివారం దిగాడు.

"అమ్మా! నీవు సామాన్య స్త్రీవి కావు. నింగి నుంచి దిగివచ్చిన దేవేరివి. నీ మహిమలు అపారం! పతనం అవుతున్న నన్ను రక్షించావు. నీకు నా సర్వస్వం సమర్పించుకున్నా తక్కువే! ఈ కానుకలు స్వీకరించు తల్లీ! నన్ను కాపాడు. నా పరిశ్రమలను రక్షించు."

ఆహుతి స్థాణువు అయి నిలిచింది. విగ్రహంలా ఉంది. ఆమెకు వినిపించడం లేదు. కనిపించడం లేదు. దధి, మధు ఆమెను చెరొక వైపు పట్టుకున్నారు. తల్లి దేవత అయి ఆకాశానికి ఎగిరిపోతుందేమో అని తలలెత్తి తల్లిని చూస్తున్నారు.

అది సొంతం ఒక చిత్రకారుడు చిత్రించిన చిత్రంలా ఉంది. ఊపిరాడుతున్న జాడసైతం లేదు.

ఆహుతికి చలనం వచ్చింది. కనురెప్పలు కదులుతున్నాయి. ఆమెకు అంతరార్థామూ తెలిసింది. ఆహుతి గుండెమంటలు ముఖం మీద కనిపిస్తున్నాయి.

"మీరు వంచకులు, మోసగాళ్లు, నన్ను నమ్మటానికి కాదు. అమ్మటానికి వచ్చారు. నేను

శ్రమించు స్త్రీని! నాకు ఇద్దరు పిల్లలు. నన్ను ఇట్లా బ్రతకనీయండి. నాకు మహిమలు కల్పించి మార్కెట్లో పెట్టకండి. నేను సామాన్యస్త్రీని. నన్ను ఇలా బ్రతకనివ్వండి."

"కాదు. మీరు దేవి. మహిమలు గలవారు. మా అదృష్టానికి దిగివచ్చారు. మాకు లాభాలు కలిగించారు. వీటిని మీకు సమర్పిస్తున్నాం. దయదలచండి. స్వీకరించండి."

"కాను. కాను. కాను. నేను పేదరాలిని. కూలిదాన్ని. నాకు మహిమలు లేవు. నాకు ఇవి వద్దు. దయతలచండి. వెళ్లండి"

"అమ్మా అట్లాగే వెళ్లిపోతాం. వీటిని ఏం చేయమంటావో చెప్పమ్మా"

"తగలపెట్టండి"

"తగలపెట్టండి" శివలింగం ఆదేశం.

అన్నీ తగలబడుతున్నాయి. మంటలు! మంటలు!! మంటలు!!! ఆహుతి ముఖంలో ఘంటలు కనిపిస్తున్నాయి.

అందరూ దండాలు పెడ్తున్నారు. లెంపలు వేసుకుంటున్నారు.

ఆహుతి కూలబడింది.

"అమ్మకు కోపం వస్తున్నది. శపిస్తుంది. పదండి. పదండి"

అందరూ వెళ్లిపోయారు. శూన్యం. మంటలు ఇంకా పూర్తిగా ఆరలేదు.

చీకట్లు ముసురుకున్నాయి.

ఆహుతి పిల్లలను కరచి పట్టు కుంది. కన్నీరు కార్చింది. బయటికి ఏడ్వలేదు.

"మధు, దధీ! వీళ్లు మనను బతకనీయరు. వెళ్లిపోదాం"

"అమ్మా! వాళ్లు మనను ఎందుకు బతకనీయరమ్మా" మధు అడిగాడు.

"వాళ్లకు లాభాలు వస్తే పూజిస్తారు. నష్టాలు వస్తే ప్రాణాలు తీస్తారు బాబూ! ఆ రెంటికీ మనం కారణం కాము. మనం బతకాలి. చావరాదు. లేవండి. వెళ్లిపోదాం"

"అమ్మా! మనం ఎక్కడికి పోతాం?" దధి అడిగింది.

"అమ్మా! ఈ భూమి విశాలం అయింది. భూమాత అందరికీ ఆశ్రయం ఇస్తుంది. నీటిలోని చేపలను, ఆకాశంలోని పక్షులను రక్షించేవాడే మనను రక్షిస్తాడు. పదండి"

వారు బయల్దేరారు. దధి చాప అందుకోబోయింది.

"వద్దమ్మా! అది ఇక్కడిదే. మనం ఇక్కడివాళ్లం కాము"

తల్లితోడ ముగ్గురూ చీకట్లలో సాగిపోతున్నారు. వెలుగును వెదుకుతూ! లోకంలో ఇంకా వెలుగు మిగిలిందా? ఇది అంధ తమస్సు.

ఆ ముప్పురికి రావి నిశ్శబ్దంగా వీడ్కోలు చెప్పింది. రావిమీది కాకి గట్టిగా కేక పెట్టింది. పల్టీలు తిరిగి నేలవాలింది. రెక్కలు కొట్టుకుంది. ప్రాణాలు విడిచింది!!

శివలింగానికి ఆ రాత్రి నిద్ర లేదు. రావి కింది మంటలు అతనిని అలముకున్నాయి! తన ఫ్యాక్టరీలన్నీ తగలబడుతున్నట్లు కలలు. తనను మంటలు చుట్టుకుంటున్నాయి!

ఆ ముండ తగలబెట్ట మనడమేమిటి? తనకన్నా బుద్ధి ఉండాలి. అంత విలువయిన వాటిని తగలబెట్టడం ఏమిటి?

రాత్రి తగలబడుతూనే తెల్లవారింది. శివలింగం పరేషానున్నడు! ఏమి సమఝ వస్తలేదు! శివలింగంమీద పిడుగుపడింది. కంపెనీల షేర్లు కనిష్ఠానికన్నా కిందికి పడిపోయాయి!

ఇదంతా ఆ ముండ పనే! దాని రక్తం కళ్ల చూడాలి! అది బతకరాదు. దాని పిల్లలు బతకరాదు!! శివలింగం హంతకుడుగా బయల్దేరాడు. మంది మార్బలంతో బయలుదేరాడు!!

శివలింగానికి బోసిమఱ్ఱి, ఆరిన పొయ్యి, దొర్లిన రెండు కుండలు, పగిలిన రెండు ముకుళ్లు, సగం చుట్టిన చాప, చచ్చిపడిన కాకి కనిపించాయి!

శివలింగం మార్కెటు బుఱ్ఱ తీరు మార్చుకుంది. వేషం మార్చుకుంది. రంగు మార్చుకుంది.

మార్కెటు బుఱ్ఱ మారీచుడు!

"అమ్మ అవతారం చాలించింది. ఇవన్నీ మనకు వదిలిపోయింది. అమ్మ మహిమ అపారం. ఇక్కడ అమ్మ ఆలయం వెలుస్తుంది" అన్నాడు.

శివలింగం అన్నంతపనీ చేశాడు. రావి అశ్వత్థం తెగిపడింది. ఆలయం వెలిసింది. అందులో విగ్రహం లేదు. అది

"అవతారం చాలించిన అమ్మ ఆలయం, అమ్మ అనుకున్న వారందరకూ దర్శనం ఇస్తుంది."

శివలింగం ఆలయాన్ని కనీ, వినీ ఎరుగని ఆధ్యాత్మిక నిలయం చేశాడు!

శివలింగం ఆధ్యాత్మిక మార్కెటులో సంస్కరణలు వ్యాపించజేశాడు!

పాపము శమించునుగాక!

"ఆర్భాటం భక్తి కాదు.
ఉరుములు వర్షించవు,
మౌనంగా ప్రార్థించాలి
మనసులోని సామి వింటాడు.

(అంధం తమః ప్రవిశంతి యే సంభూతి ముపాసతే"
-12. ఈశావాస్య ఉపనిషత్తు)

■

## హృతిక్‌కు దెబ్బ మీద దెబ్బ!

హృతిక్ రోషన్ నటించిన 'కహోనా ప్యార్‌హై' సూపర్ డూపర్ హిట్టు కొట్టడంతో హృతిక్‌ను హాలివుడ్ హీరోతో పోల్చారు. కాని ఆ తర్వాత వచ్చిన సినిమాలన్ని ఫ్లాప్ కావడంతో అగ్గిమీద నీళ్లు పోసినట్లయింది హృతిక్ పరిస్థితి. ప్రస్తుతం హాలివుడ్ మాట అటుంచి బాలివుడ్‌లో అవకాశాలు రావడానికే నానావస్థలు పడాల్సి వస్తోంది. ఈయన నటించిన ఇటీవలి చిత్రం 'ముఝ్‌సే దోస్తి కరోగి' కూడా నిరాశ పర్చడంతో కనీసం టి.వీ ప్రసారానికైనా అమ్మేసి కొంతైనా లాభం రాబట్టుకోవాలని చూస్తున్నాడు నిర్మాత.

జె.

